క్లుప్తంగా

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



ఆగిరిపల్లి: ఈ నెల 11న సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ సోమవారం ఆగిరిపల్లిని సందర్శించారు. ఆగిరిపల్లిలో పర్యటనకు ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు డీఎస్పీ ప్రసాద్, నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై శుభశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో మెరుగైన ఆరోగ్యం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రోజూ యోగా సాధన చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని శాంతివన్ యోగా ఫౌండేషన్ అధ్యక్షుడు లంకే జనార్ధన్ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండపల్లి నాగార్జున హైస్కూల్‌లో ఆరోగ్యంపై అవగాహన సదస్సులో ఆయన సోమవారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా యోగా, ధ్యానం సాధన చేస్తే ఆత్మనూన్యతా భావన పోతుందన్నారు. ఆత్మవిశ్వాసం, పట్టుదల, దృఢసంకల్పం పెరుగుతాయన్నారు. హెచ్‌ఎం షేక్ సర్దార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆగిరిపల్లి: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ మాలిని వైద్యులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు సూచనలు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు, రికార్డుల నిర్వహణ అంశాలపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 11న సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా ఆగిరిపల్లిలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయాలని వైద్యులను ఆదేశించారు. డెప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, వైద్యులు జగన్‌మోహన్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



తిరువూరు: విజయవాడలో డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ, ఫైన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ట్రస్టు ఇటీవల నిర్వహించిన అఖిల భారత చిత్రలేఖన పోటీల్లో తిరువూరు అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు పలు బహుమతులందుకున్నారు. 12 మంది విద్యార్థులు బంగారు పతకాలు, 13 మంది రజిత పతకాలు గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ కోటిరెడ్డి తెలిపారు. పదోతరగతి విద్యార్థి జీ రిత్విక్ ఆలిండియా యువ చిత్రకళారత్న అవార్డును, ఆర్ట్స్ ఉపాధ్యాయుడు వీ వెంకట్రావు ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు, తమ పాఠశాల ఉత్తమ స్కూలు అవార్డు సాధించారని తెలిపారు.

గాలులకు కమ్మేసిన బూడిద



జి.కొండూరు: ఇబ్రహీంపట్నంలో సోమవారం సాయంత్రం వీచిన పెనుగాలులకు వీటీపీఎస్ బూడిద విధ్వంసం సృష్టించింది. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో డంప్ చేసిన బూడిద పట్టణాన్ని మబ్బులా కమ్మేసింది. గాలితో కలిసి బూడిద కమ్మేనయడంతో వాహనదారులు నరకయాతన పడ్డారు. బూడిద ఇళ్లలోకి సైతం చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కొద్ది సమయం పట్టణంలో ఏం జరుగుతుందో అర్థం కాక స్థానికులు ఆందోళన చెందారు.

రేపు సర్వసభ్య సమావేశం

ముసునూరు: ఈ నెల 9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.రాణి సోమవారం తెలిపారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

కదలని మురుగు.. వదలని దోమలు

- పారిశుద్ధ్యానికి ఏడాదికి సుమారు రూ.నాలుగు కోట్లకుపైగా ఖర్చు
- అయినా ఎక్కడి సమస్యలు అక్కడే
- డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు



నూజివీడులోని ఎన్నెస్పీ గేటు వద్ద నిలిచిన మురుగు నీరు

నూజివీడు: పట్టణంలో కాలువలు చెత్తా చెదారంతో నిండిపోయి మురుగునీటి తటాకాలుగా మారుతున్నాయి. రోజుల తరబడి నిల్వ ఉన్న మురుగునీటిలో దోమలు ఉద్ధృతంగా పెరుగుతుండటంతో దోమపోటుకు గురవుతున్నారు. దీని వలన ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పట్టణంలో మొత్తం 32 వార్డులు ఉండగా ఒకటో వార్డు ఎమ్మార్ అప్పారావు కాలనీ కాగా, ప్రధాన పట్టణంలో 31 వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లో చెత్తాచెదారాన్ని వేస్తుండటంతో మురుగు నీటి కాలువలు పూడుకుపోయి మురుగునీరు ప్రవహించకుండా నిల్వ ఉంటోంది. దీంతో దోమల ఉత్పత్తి పెరుగుతోంది.

నిర్వహణ సరిగా లేక..

పారిశుద్ధ్య పనుల నిర్వహణ సరిగా లేకపోవడం వలన ఈ పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు వాపోతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రతి రోజూ కాలువల్లో పడే చెత్తాచెదారాన్ని తొలగించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా పని చేస్తున్న దాఖలాలు లేవు. దీంతో ప్రవహించడానికి వీలు లేక మురుగు నీరు కాలువల్లోనే నిల్వ ఉంటోంది. ప్రధాన రోడ్లలోని కొబ్బరి బోండాల వ్యాపారులు, టీ స్టాల్స్, ఇతర దుకాణాల యజమానులు చెత్త, ఖాళీ కొబ్బరి బోండాలను, గ్లాసులను, డ్రెయినేజీల్లో పడేస్తున్నారు. దీంతో మురుగునీరు ప్రవహించడం లేదు.

ఏడాదికి రూ.3.48 కోట్లకు పైనే ఖర్చు..

పట్టణంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు రూ.3.48 కోట్లు ఖర్చు చేస్తున్నారు. బ్లీచింగ్ ఇతర మెటీరియల్‌కు అదనంగా సుమారు రూ.80 లక్షలు ఖర్చు చేస్తున్నారు. 145 మంది కార్మికులు ఉన్నారు. ఐదుగురు మేస్త్రీలు, పట్టణంలో 16 సచివాలయాలకు 16 మంది శానిటరీ కార్యదర్శులు, వీరందరిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ శిధుల్లో ఉంటారు. అయినా ఎక్కడి సమస్యలు అక్కడే టుంటున్నాయి. సరైన ప్రణాళిక, పర్యవేక్షణ లేకపోవటమే ఇందుకు కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు.

పక్కా డ్రెయినేజీ లేని ప్రాంతాల్లో..

పట్టణంలో పక్కా డ్రెయినేజీ లేని ప్రాంతాల్లో మురుగు నీరు ఎక్కడికక్కడ ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉండటంతో స్థానికులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. ఎంప్లాయీస్ కాలనీ నుంచి ప్రాపర్టీ ట్యాక్స్ రూపంలో అత్యంత ఎక్కువ మొత్తంలో మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. ఒక్క ప్రధాన రహదారి మినహాయిస్తే ఈ కాలనీలో పక్కా డ్రెయినేజీ సదుపాయమే ఇంత వరకు లేదు. దీంతో గృహాల్లో వాడిన నీరు ఖాళీ స్థలాల్లోకి చేరి నిల్వ ఉంటోంది. దీని వలన దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. కోనేరుపేట, కొప్పుల వెలమపేట, గాంధీనగర్, నందనంతోట, గొడుగువారిగూడెం, బంగినిపల్లితోట, ఎన్టీఆర్ కాలనీ, శ్రీరామ్‌నగర్, కృష్ణవిలాస్ నగర్, రామాయమ్మరావు పేట, తదితర ప్రాంతాల్లో నేటికీ పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేదు. పక్కా డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సీసీ డ్రెయినేజీ నిర్మించాలి..



పట్టణంలో సీసీ డ్రెయిన్లు నిర్మించాలి. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి మురుగు నీరు పారేలా చూడాలి. దోమల వలన ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. దోమల నుంచి రక్షించేందుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి.

– బేరా రామ్, నూజివీడు

దోమలను నివారించండి..



సీసీ డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దోమలు ఎక్కువగా ఉన్నందున దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. మురుగు నీటిలో దోమల మందు పిచికారీ చేసి, రాత్రి సమయాల్లో పట్టణమంతా ఫాగింగ్ చేయాలి.

– చాట్ల పుల్లారావు, నూజివీడు

అంగన్‌వాడీ కార్యకర్తను దూషించడం హేయం

విస్సన్నపేట: పల్నాడు జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తపై లైంగికవేధింపులకు పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం విస్సన్నపేట సుందరయ్య భవన్‌లో సీఐటీయూ, కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తను లైంగికంగా వేధించడంతో పాటు కులం పేరుతో దూషించడం తగదన్నారు. ఆమెతో అసభ్యకరంగా మాట్లాడిన అధికార పార్టీ నాయకుడ్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నాయకులు మేకల జ్ఞానరత్నం, భాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 555 మంది హాజరు



జి.కొండూరు: వివిధ కార్పొరేషన్‌ల ద్వారా స్వయం ఉపాధి కల్పన కోసం అందిస్తున్న రుణాలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు స్థానిక కమ్యూనిటీ హాలులో సోమవారం ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ రుణాలకు మండల పరిధిలో మొత్తం 662 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా ఇంటర్వ్యూలకు 555 మందిహాజరైనట్లు ఎంపీడీఓ రామకృష్ణనాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



రాంబాబు కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జమలాపురపు రాంబాబు(షామియానా రాంబాబు) సోమవారం గుండెపోటుతో మరణించగా, ఆయన భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సందర్శించి నివాళులర్పించారు. రాంబాబు మృతి పట్ల తీవ్ర విచారం వెలిబుచ్చారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రాంబాబు కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని విచారం వ్యక్తం చేశారు. ప్రతాప్‌తో పాటు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్ పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

విజయవాడరూరల్: వివిధ కార్పొరేషన్‌ల ద్వారా స్వయం ఉపాధి పథకం కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీకృష్ణ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బీసీ, కాపు, వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ, మేదర, కుమ్మరి, ఈబీసీ కార్పొరేషన్ల రుణాలకోసం దరఖాస్తు చేసిన వారు హాజరు కావాలని కోరారు. గొల్లపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే ఇంటర్వ్యూలకు గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల అభ్యర్థులు, జక్కంపూడి కాలనీ 2, 3 గ్రామ సచివాలయాల వద్ద జరిగే ఇంటర్వ్యూలకు జక్కంపూడి, కె.తాడేపల్లి, గొల్లపూడి- 5 గ్రామ సచివాలయం నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం ఒరిజినల్, జిరాక్స్‌లతో రావాలని ఎంపీడీఓ తెలియజేశారు.

మాజీ మంత్రిని కలిసిన వైఎస్సార్ సీపీ నేత



రాజేంద్ర ప్రసాద్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి జోగి రమేష్ తదితరులు

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులైన పెండెం రాజేంద్రప్రసాద్ ఇబ్రహీంపట్నంలో మాజీమంత్రి జోగి రమేష్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తనను నియమించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి జోగి రమేష్, జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. రాజేంద్రప్రసాద్‌ను జోగి రమేష్ శాలువాతో సత్కరించి అభినందించారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. జికొండూరు మండల జెడ్పీ టీసీ మందా చక్రధరరావు, చిన్ననందిగామ వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

శారీరక శ్రమతో ఆరోగ్యకర జీవనం



తిరువూరులో వాకర్స్‌క్లబ్, లయన్స్ క్లబ్ సభ్యుల ప్రదర్శన

తిరువూరు: ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని తిరువూరు జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వీ రవీంద్ర సూచించారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా తిరువూరు నాగార్జున కళాశాలలో విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. యువత సరైన ఆహార నియమాలు పాటించకపోవడంతో చిన్న వయసులోనే అనారోగ్యం పాలవుతున్నారని, మద్యం పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజూ క్రమం తప్పని వ్యాయామం, నిర్ణీత సమయం నడవడం తప్పనిసరిగా పాటించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శేషగిరిరావు, డైరెక్టర్ సూరిబాబు, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, సభ్యులు హరికృష్ణ, రాంప్రదీప్, పాపారావు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నడకమిత్రుల ప్రదర్శన

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్ నుంచి నడక మిత్రుల ప్రదర్శన నిర్వహించారు. 3 కిలోమీటర్ల దూరం నడుస్తూ ప్రతిరోజూ ఉదయపు నడక చాలా మంచిదని, శరీరానికి అవసరమైన వ్యాయామం చేయాలని నినాదాలు చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తాళ్ళూరి రామకోటేశ్వరరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, వాహిని ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రేష్మాబేగం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన ప్రదర్శన జరిపారు. హెల్త్ సూపర్‌వైజర్ రవి, హెల్త్ విజిటర్ ఆశాబీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



నూజివీడు: పిల్లలతో ప్రతి రోజూ అంగన్‌వాడీ కేంద్రంలో యాక్టివిటీస్ చేయించాలని మహిళా సంక్షేమం, శిశుఅభివృద్ధి శాఖ జిల్లా పీడీ పి.శారద పేర్కొన్నారు. పట్టణంలోని కొప్పుల వేలమపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలతో పాటలు పాడించడంతో పాటు ఆటలు ఆడించారు. పిల్లలకు సిద్ధం చేసిన భోజనాన్ని, స్టాకు రిజిస్టర్లను తనిఖీ చేశారు. పిల్లల బరువుల వివరాలను పరిశీలించి పోషణ లోపం ఉన్న పిల్లల పట్ల అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, వారికి పోషకాహారం అందించి పోషణ లోపం లేకుండా చూడాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లందరూ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేసేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇన్‌చార్జి సీడీపీఓ కె.ధనలక్ష్మి పాల్గొన్నారు.

అకాల వర్షం.. కూలిన చెట్లు

విద్యుత్ సరఫరాకు అంతరాయం



విస్సన్నపేటలో ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డుగా పడిన చెట్టు

విస్సన్నపేట: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొర్లమండ, మిట్టగూడెం, పుట్రేల గ్రామాల్లో తాటి చెట్లు విరిగి విద్యుత్ తీగెలపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆర్ అండ్ బీ రహదారులపై చెట్లు విరిగి పడిన కారణంగా వాహనాల రాకపోకలు సైతం నిలిచిపోయాయి. విద్యుత్ లైన్లపై పడిన చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగించి సరఫరా పునరుద్ధరిస్తామని విద్యుత్ ఏఈ విజయభాస్కర్ తెలిపారు.

కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనంలో పనులు చేపట్టాలి



జిల్లా కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత శీలం రాము, కౌన్సిలర్లు, నాయకులు

నూజివీడు: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయాన్ని నిర్వహించేందుకు సిద్ధం చేసిన తాత్కాలిక భవనంలో మైనర్ పనులు చేపట్టేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ అధ్యక్షుడు శీలం రాము, పలువురు కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. పనులను చేసి అప్పగించమని రెండు నెలల క్రితం కేంద్రియ విద్యాలయం జాయింట్ కమిషనర్ తెలియజేసినప్పటికీ మున్సిపల్ అధికారులు తాత్సారం చేస్తున్నారని, దీని వలన ఈ ఏడాది తరగతులు నిర్వహించడానికి వీలు లేకుండా పోతుందన్నారు. స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డిని పిలిచి పనులను పూర్తిచేసి భవనాన్ని త్వరగా అప్పగించాలని ఆదేశించారు. కౌన్సిలర్లు మీర్ అంజాద్ ఆలీ, కొడవటి రాంబాబు, వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు షేక్ యూనస్‌పాషా (గబ్బర్), షేక్ మస్తాన్‌వలీ, కళ్లేపల్లి ఆదినారాయణ, తలారి సతీష్ పాల్గొన్నారు.

వైకుంఠధామంలో శాంతి హోమం



కాచవరంలోని వైకుంఠధామంలో శాంతిహోమం నిర్వహిస్తున్న అర్చకులు

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త, బోడేపూడి అప్పారావు, కాశీరత్నం దంపతులు గ్రామస్తుల నిర్మించిన వైకుంఠధామాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శివుని విగ్రహ ప్రతిష్ట చేసి పూజా కార్యక్రమాలు, శాంతిహోమం జరిపారు. గ్రామంలోని పురాతన శ్మశాన వాటిక అభివృద్ధి చేసి అంతిమ సంస్కారాలు ఉత్తమంగా జరగాలనే సంకల్పంతో రూ.35 లక్షలు వెచ్చించి వైకుంఠధామం నిర్మించారు. పితృకార్యాలకు నూతన భవనం, విశ్రాంతి మందిరం, ఫ్రీజర్ బాక్స్, మృతదేహాలకు చితిమంటల హాల్, ప్లాట్ ఫారమ్, నీరు, విద్యుత్ సదుపాయం, స్నానాలకు షవర్లు, ప్రహరీ, ఆర్చరీ, ప్రధాన గేటు, గ్రీనరీ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన బోడేపూడి అప్పారావు తెలంగాణలో పారిశ్రామిక వేత్తగా స్థిరపడ్డారు. పుట్టిన ఊరికి మంచి చేయాలనే తలంపుతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో రామలింగేశ్వరస్వామి, రామాలయం ఆలయాలు నిర్మించారు. కాచవరంలో బైటెక్స్ అనే పరిశ్రమ స్థాపించి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

ఎంటీయూ 1010 రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి

తిరువూరు: దాళ్వాలో రైతులు సాగుచేసిన ఎంటీయూ 1010 రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కౌలురైతుల సంఘం, రైతు సంఘం నాయకులు సోమవారం జిల్లా కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. గంపలగూడెం మండలంలో రబీ సాగులో 1010 రకం సుమారు మూడు వేల ఎకరాల్లో సాగుచేసినందున ఈ రకాన్ని కొనుగోలు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని రైతు సంఘ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పగడాల వీరాంజనేయులు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. ఎంటీయూ 1010 రకాన్ని ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నందున రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వమే ఈ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

సారా స్వాధీనం

ఆగిరిపల్లి: ఎక్సైజ్ అధికారులు ఆగిరిపల్లిలో దాడులు నిర్వహించి సారా అమ్ముతున్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆగిరిపల్లిలో అక్రమంగా సారా అమ్ముతున్న అంజలి వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకొని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమెకు సారా సరఫరా చేస్తున్న నెక్కలం గొల్లగూడేనికి చెందిన మాదు రాముపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఈశ్వరరావు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

ముసునూరు: అక్రమంగా సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి, సారా విక్రయిస్తున్న మహిళను ఏలూరు స్పెషల్ స్క్వాడ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వైవీఎస్ఎస్ ఫణికుమార్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. సోమవారం మండలంలోని చెక్కపల్లికి చెందిన తాళం వరలక్ష్మి సారా అమ్ముతున్నారనే సమాచారంతో ఇంటిలో సోదాలు నిర్వహించి, రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సారా తెచ్చి ఆమెతో అమ్మిస్తున్న భర్త చెన్నారావుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పాత నేరస్తుడికి రూ.లక్ష జరిమానా

తిరువూరు: సారా కాస్తూ పట్టుబడి తహసీల్దారు ఎదుట గతంలో బైండోవర్ చేసిన పాత నేరస్తుడు నిబంధనలు ఉల్లంఘించడంతో గంపలగూడెం తహసీల్దారు రూ.లక్ష జరిమానా విధించారు. సోమవారం గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంకు చెందిన గుంజి అశోక్ మళ్లీ సారా కాస్తుండటంతో తహసీల్దారు ఈ జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఏకొండూరు మండలం కుమ్మరికుంట్ల తండాకు చెందిన లావూరి శివ కూడా సారా కేసులో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో తహసీల్దారు రూ.10 వేల జరిమానా విధించారని తెలిపారు.

సారా విక్రేతల అరెస్టు

విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాలో సారా విక్రేతలు బాణావత్ మంగి, బాణావత్ విజయలను, ఏకొండూరు మండలం కుమ్మరికుంట్ల తండాకు చెందిన లావూరి గణేష్, పద్మలను అదుపులోకి తీసుకోగా గణేష్ పరారైనట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. సిద్ధార్థనగర్‌కు చెందిన లావూరి గోపీని అరెస్టు చేసినట్లు తెలిపారు. విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ శేఖర్‌బాబు విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లిలో సారా విక్రయిస్తున్న దారావత్ రమేష్ నుంచి 4 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీదారులు బాణావత్ మంగి, విజయ, వడిత్య చంద్రయ్యలను విస్సన్నపేట తహసీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

నీటి సమస్యలు లేకుండా చూడండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వేసవి దృష్ట్యా ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశించారు. సోమవారం గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు, రైతులు నీటి కోసం ఎటువంటి ఇబ్బందులు పడకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అన్నారు.

భూవివాదంలో దాడి, ఒకరికి గాయాలు



విస్సన్నపేట: మండలంలోని తాతకుంట్లలో భూవివాదం నేపథ్యంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాతకుంట్లకు చెందిన సాదం నాగభూషణం, గుండ్రు చిట్టిబాబుల నడుమ భూవివాదం కోర్టులో పెండింగ్‌లో ఉంది. కోర్టు తమకు ఇంజక్షన్ ఉత్తర్వులు ఇచ్చినందున పొలం దున్నుకుంటామని ట్రాక్టరుతో పొలంలోకి వెళ్లిన నాగభూషణంతో చిట్టిబాబు ఘర్షణ పడ్డాడు. ఈ ఘర్షణలో నాగభూషణం తలకు తీవ్ర గాయాలవగా నూజివీడు ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా వెంకటరత్న రాజు



జి.కొండూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నంకి చెందిన పచ్చిగోళ్ల వెంకటరత్న రాజు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం నియామకపత్రాన్ని విడుదల చేసింది. వెంకటరత్న రాజుని పలువురు పార్టీ శ్రేణులు అభినందించారు.

ఆలయంలో అన్నదానం



వాత్సాయి: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని చనుబండ శ్రీకోదండ రామాలయంలో సోమవారం మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు నడిపల్లి కిషోర్, వనమా కేశవరావు, కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులో రాయితీ పొందండి

నూజివీడు: పట్టణంలో 2025- 26 ఆర్థిక సంవత్సరంలో ఇంటిపన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లించాల్సిన యజమానులు ఏక మొత్తంలో ఏప్రిల్ 30వ తేదీ లోగా చెల్లించినట్లయితే ఐదు శాతం రాయితీని ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరులోగా ఏకమొత్తం చెల్లించి ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.